

# విచిత్రవివాహం

నా అంతట నేను మా అబ్బాయి కటువంటి పెళ్ళిచేసి ఉండను. ఆ పెటకం మీ రామమూర్తే పెట్టాడు. వాడు తప్ప మరెవ్వడుచెప్పినా అటువంటి ఆలోచనను అంగీకరించిఉండేవాణ్ణి కాను కూడాను.

ఈఉత్తరం తిలకించండి.

'నాగపూరు, 5 జూలై 1924.

'ప్రియమిత్రమా, (ఉత్తరం ఇంగ్లీషులో) 3 వ తేదీన నువ్వురాసిన ఉత్తరం నన్ను చాలా ఆందోళన పెట్టింది. మీఅబ్బాయి పెళ్ళివిషయం ఆలోచిస్తున్నా నన్నువాడవు మా అమ్మాయివిషయం ఎందుకు అడిగావు కావు? నేను నిన్నెందుకు క్షమించను—ఒక షరతుమీద తప్ప. అదేమిటంటే నువ్వు మీ అబ్బాయికీ మా అమ్మాయికీ వివాహంచెయ్యాలి. అదికూడా నేను చెప్పే తీరుగా. మా పెద్దదానిపెళ్ళితో నాకు పెళ్ళంటే హడలిపోయింది. నీకుకూడా అటువంటిభయమే కలిగి ఉండేది నా పెద్దపిల్లమీద నీకు తగినంత కటాక్షంఉండి ఉంటే.

'మనిద్దరికీ భగవంతుడు కొంతబుద్ధి ప్రసాదించాడు. బుద్ధిగలమనిషి కొక్క అనుభవం. నా అనుభవం నీది కాదా? నువ్వుకూడా నేనుపడ్డగోతులో పడాలా? మంత్రాలబలిమియందు నాకు నమ్మకంచచ్చింది. నీకింకా చావలేదా? భార్యాభర్తల ఇష్టాయిష్టాలతో ఏమీ సంబంధంలేకుండా ఆజన్మాంతం ఇద్దర్నీ ఒకరి కొకర్ని అంటగట్టటం పాపంగా తోచటంలేదా నీకింకా? ఊరికే తోచి ఏంప్రయోజనం? ఆచరణలోకి ఎప్పుడొస్తుంది? కీకారణ్యంగాఉన్న ఈ సంఘచట్టాన్ని ఒక ఛెంగనించి బాగుచేసుకుంటూ ఎందుకు రాగూడదు మనం? ఎప్పటికైనా నా సందవచనం అవుతుందేమో.

'మనపిల్లలకు కొత్తరకం వివాహంచేద్దాం. ఎందుకు చెయ్యకూడదు? ఆ వివాహాన్నిగురించి వివరాలు తరవాతరాస్తాను. ముందు ప్రస్తుతవివాహపద్ధతిలో ఉన్న లోపాలేమిటో గమనించి వాటిని మనం సరిచేసుకుందాం.

'నీకూ నాకూ ఇప్పుడు ప్రేమలో నమ్మకంలేదు. మనకు చిన్నతనంలో లేదా? అప్పుడు మనమనస్సుకు తృప్తిజరిగిందా? లేదు. ఎందుకల్ల? మనం చేసుకోవలసిన పనులన్నీ ఎవరోచేశారు. మనమూ మనభార్యలూ ఇంకొకరి సహాయంలేకుండా కలుసుకుంటే ఎంత ఆనందంగాఉండేది? ఊహించుకో.

'తరవాత మనసంసారాలు చూడు. భార్యాభర్తలకు మొదట్లో పరస్పరాకర్షణఉన్నా, అది పాంతంగా పొయ్యేదాకా, ఒకరిమీద ఒకరికి అసహ్యంపుట్టే దాకా, చక్కగా సుఖమయంగా ఉండవలసినసంసారం కుళ్లుగుంట ఆయేదాకా భార్యాభర్తలు ఒకర్నిగురించొకరు తెలుసుకోగూడని విషయాలన్నీ తెలుసుకుంటారు. ఆపైనేముంది? కొంచెం రసికల ఆడదిగాని మగవాడుకాని అయితే సంఘచట్టాలన్నిటికీ తిరగబడటం, అతిక్రమించటం, అపఖ్యాతి, లేకపోతే ఈ మురికిగుంటలోనే మునగానాం తేలానాం.

'ఆపైన మగవాడు ఆడదానికందకుండా వృద్ధికావటం. పిల్లలు ఈ ఇద్దరిమధ్యా ఊగుతూండటం. ఎవరోచెప్పినట్టు ఆడవాళ్ళు సంఘంలో చీట్లపేకలో బొడిముక్కలల్లేఉన్నారు. వాళ్ళవిధంగా అభివృద్ధి పొందటానికి అవకాశంలేదు. ఇంకోసంగ[illegible]డు. అన్ని

749

శక్తులూ ఉన్న మగవాడికి ఆస్తిలో భాగమేమిటి? అసలు మగవాడికన్న ఆడదానికే అనేకరెట్లు డబ్బు అవసరం. పిల్లలను ఎవరికైనా కననీ కాక ఏ ఆడదానిపిల్లలు ఆ ఆడదాని పోషణలోనే ఉండటంసహజం. నా పెద్దమ్మాయి కొద్దికాలంలో ఉద్యోగంలో ప్రవేశించబోతున్నది. మా చిన్నదాన్ని పెద్దచదువు చదివిస్తాను. అది నెలకు నూరూ నూటయాభై సంపాదిస్తే కాని నాకు తృప్తిఉండదు. నా స్వార్జితం ఇద్దరికీ పంచేస్తాను.

'మరోవిషయం. మనిద్దరం ఒకరిమాటలు ఒకరు ఎట్లా అర్థంచేసుకుంటామో, నాపిల్ల మీ అబ్బాయిని అట్లా అర్థంచేసుకుంటుందని గ్యారంటీ ఇస్తున్నాను. నాపిల్ల మీవాడి నెత్తిన బరువల్లేఉండదు. దాని నైతిక బాధ్యతలూ ఆర్థికబాధ్యతలూ మీ వాడి నెత్తిన వెయ్యదు. ఇద్దరికీ ఎప్పుడభ్యంతరమైతే అప్పుడు విడిపోవచ్చును. ఒకర్నిగురించి ఒకరు అవసరమైనదాని కన్న ఎక్కువ తెలుసుకోనక్కర్లేదు. నిజంగా మన అనుభవంలోకి ఎన్నడూరానిప్రేమే వాళ్ళకు కలగటమే జరిగి, సామాన్యమానవుల్లేకాక, వాళ్ళు ఒకరి దౌర్బల్యమందు ఒకళ్ళు సానుభూతి చూపగలిగితే వాళ్ళిద్దర్నీ భగవంతుడుకూడా ఎడబాపలేడు కదా. ఆలోచించు.

'ముఖ్యమైనవిషయం. ఇది చట్టంగాచేసి లోకానికి ఇవ్వకుమా. ఎంతమంచి చట్టమయినాసరే, ఆదివేసుల చేతుల్లో విషంగామారుతుంది. లేకపోతే ఇప్పుడమల్లో ఉన్న చట్టాలన్నీ సంఘానికి కీడకలిగించాలని ఉద్దేశించబడ్డవా?

'ప్రత్యక్షంగా అంతా మాట్లాడతాను. నీక్షేమం...'

రామమూర్తిమీద నాకు గురేననండి, నాకు వాడి వాదన సమంజసంగా తోచటంచేతనే కానివ్వండి నేను వాడి ఏర్పాట్లన్నీ అంగీకరించాను. అప్పటికి మా అబ్బాయికి పదిహేడేళ్ళు, రామమూర్తికూతురు పదమూడేళ్ళది. మరి మూడుసంవత్సరాలదాకా మేమేమీ చెయ్యదలచలేదు.

1927 మార్చిలో రామమూర్తి మా ఇంటిపక్కస్థలం వెయ్యిగజాలుకొని ఇల్లుకట్టాడు, అది తన చిన్న కూతురి కోసమే.

నేను మా అబ్బాయితోకాని రామమూర్తి తన పిల్లతోకాని ఏమీ చెప్పలేదు.

ఆ డిశంబరులో రామమూర్తి ఇద్దరు పిల్లలనూ తీసుకుని (భార్య రెండోపిల్ల పుటకల్లోపోయింది.) కొత్త ఇంట్లో ప్రవేశించాడు. 'మూడునెలలు శెలవమీద వచ్చాను. అంతదాకా ఉండిపోతాను. ఈలోపుగా ఏం కానుందోచూదాం.' అన్నాడు రామమూర్తి. నేను సరేనన్నాను. మావాడప్పటికి బి. ఏ పూర్తిచేసి ఇంటి దగ్గిరే ఉంటున్నాడు.

రామమూర్తి రెండోకూతురు అందమైన పిల్లే. చాలా చొరవగలది కూడాను. పేరు అలివేణి. మావాడికీ దానికీ స్నేహమయిందంటే పేరుకాదు కారణం. రామమూర్తి పెద్దసమూర్త సామాన్యంగా ఇల్లుకదిలేది కాదు.

రామమూర్తి తనతెలివంతా వినియోగించి మాపిల్లలిద్దరికీ బాగా పరిచయంకలిగే అవకాశాలన్నీ ఇచ్చాడు. సినిమాలకూ నాటకాలకూ మావాడివెంట అలివేణిని పంపిస్తూండేవాడు. మావాడు వాళ్ళింటికి సామాన్యంగా వాళ్ళింటికొచ్చే వేళప్పుడు తను ఇంట్లో ఉండేవాడుకాడు. పెద్దపిల్ల ఇంట్లో ఉన్నా లేనట్టే.

వీళ్ళకిటువంటి స్వేచ్ఛఇవ్వటం అపాయకరమేమో అనిపించేది మధ్యమధ్య నాకు. సాంప్రదాయం ఎక్కడికిపోతుంది?

కాలంగడిచినకొద్దీ ఈస్నేహం పేం చూస్తుండగానే పెరిగిపోయింది. అలివేణి అస్తమానం మావాడితో ఏదో రహస్యాలోచన చేస్తున్నట్టు గ్రహించాను. నా కర్థంకాలేదు. రామమూర్తితో చెబితే తన కర్థమైనట్టు సూచించాడు.

ఎందువల్లో నాకు రోజులుగడుస్తున్నకొద్దీ ధైర్యం తగ్గటం మొదలుపెట్టింది. మొత్తానికి రామమూర్తి మొండిఘటం.

ఒకరోజు నేను దీపాలుపెట్టినతరవాత ఇంటికొస్తూ బజారులో ఒకబండీలో మావాడు అ[illegible]తో బండీ ఎక్కిపోతూండటం చూశాను. బండిలో ఇద్దరూ కాక

పెట్టెకూడా ఒకటుంది. నా కనుమానం కలిగింది. ఏ వూరైనా లేచిపోతున్నారా? ఎందుకు?

ఈ విషయమేమిటో కనుక్కుందామని నేనుకూడా స్టేషనువైపున నడవటం మొదలుపెట్టాను. ఆ ఇద్దరూ అక్కడికి చేరుకున్నారన్నమాట. వాళ్ళెక్కవలసిన బండి స్టేషనుదగ్గిర కనిపించింది. నేను మెల్లిగా లోపలికిపోయి అటూ ఇటూ చూడటం మొదలుపెట్టాను వీళ్ళకోసం. ఆ గుంపులో ఇద్దరూ కనపడ్డారు. మావాడిచేతులో పెట్టెఉంది. అలివేణిచేతులో రెండు టిక్కట్లున్నై. ఇద్దరూ బయటికిపోతున్నారు ప్లాటుఫారంమీదికి. ఇంతలో బండికూడావచ్చింది.

నేనుకూడా ప్లాటుఫారం టిక్కట్టుకోసం కిటికీ దగ్గిరికిపోతే అప్పుడే బుకింగాఫీసరుగారూ ఎక్కడికో నిష్క్రమించాడు. ఆయనకోసం కేకలుపెట్టి ఎట్లాగైతేఏం ఆయనతో ఘర్షణచేసి టిక్కట్టుతీసుకుని నేనుకూడా ప్లాటుఫారంమీదికి పొయ్యేటప్పటికి రైలు సాగింది. నే నొక్క అరనిమిషంసేపు దానివంకచూసి నిట్టూర్పువిడిచి వెనక్కుతిరిగేటప్పటికి 'నాన్నా!' అని పిలుపు వినబడ్డది. మావాడు. నాకేమీ అర్థంకాలేదు.

'నువ్వుకూడా పోలేదేంరా?' అన్నాను.

మావా డాశ్చర్యంతో 'ఎక్కడికి?' అన్నాడు.

నాకుమాత్రం ఏంతెలుసు?

'అలివేణి ఏది!' అన్నాను.

మావాడునవ్వి 'నీకెట్లా తెలిసింది?' అన్నాడు.

'ఏది అలివేణి?'

'నాగపూరు పోయింది.'

నా కసలర్థంకాలేదు.

'ఎందుకు.'

పెళ్ళిచేసుకోటానికి. అక్కడ ఎవడో ఉన్నాట్ట. వాడిదగ్గిర్నించి ఉత్తరాలొచ్చేవి ఆ అమ్మాయికి. అంతా నాకుచెప్పింది. వాళ్ళనాన్నకు చెప్పటానికి భయంట. సరే నా చాతయిన సహాయం చేశాను.'

నేనేమీ మాట్లాడలేదు. ఏముంది మాట్లాడటానికి.

—కొడవటిగంటి కుటుంబరావు.

# పరిశ్రమ, మృత్యువు, రోగం.

[టాల్‌స్టాయి కథకు అనువాదము.]

ఈకథ దక్షిణ అమెరికా ఇండియనులలో చెప్పుకొనటం వాడుక.

వారేమంటారంటే — దేవుడు మానవజాతిని సృష్టించేటప్పుడు యెవ్వడూ కష్టించి పనిచేయవలసిన అగత్యంలేకుండా చేశాడట. ఉండటాని కిల్లుగాని, కట్టగుడ్డగాని, తినటానికి తిండిగాని యేదీ అవసరంలేకుండానే, ప్రతివాడూ నిండా నూరేళ్ళు బ్రతికేవాడు. ఆకాలంలో రోగమన్నమాటే యెరుగరు ప్రజలు.

తరువాత కొంతకాలానికి ప్రజలేవిధంగా బ్రతుకుతున్నారో చూదామనివచ్చాడు భగవంతుడు. వాళ్ళలో ఐక్యత, సుఖము నశించిపోయి పరస్పరకలహాలు ప్రబలిపోయినవి. ఎవనిస్వార్థం వాడే చూచుకుంటూ, సుఖానికి బదులుగా అందరూ దుఃఖమే అనుభవిస్తూవుండటం చూచాడు.

దేవుడీ దురవస్థచూచి ఎవడికి వాడే విడిబడి స్వార్థపరుడై బ్రతికటంచేతనే ఈస్థితి సంభవించిందని తనలో తాననుకున్నాడు. ఈ స్థితంతా మార్పుచెందించే తలంపుతో, ప్రతివాడూ కష్టపడి యేదోయొకపని చేసుకోవలసిన అగత్యం కల్పించినాడు. పనిలేకపోతే బ్రతకడమే అసంభవమనుకునేటట్లు చేశాడు. చలిబాధ పోగొట్టుకొనటానికి మనుష్యు లిళ్లుకట్టుకోవలసి వచ్చింది. ఆకలి తీర్చుకొనటానికి భూమిదున్ని పంటలు పండించటం, ఫలవృక్షాలు నాటడం అవసరమయింది

కష్టించి పనిచేసుకొనే అభ్యాసమే తిరిగి అందరిని ఒక్కటిగా చేయగలిగిన సాధన